కదిలిన కాడెద్దులు

- ముమ్మరంగా ఖరీఫ్ సాగు
- నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 50,758 ఎకరాలు
- జూన్ మాసంలో సాధారణం కంటే తగ్గిన వర్షపాతం

జూపాడుబంగ్లా: అడపా దడపా ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ పంటలను సాగుచేస్తున్నారు. మే నెల సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు కురవటంతో ఎండల తీవ్రత అధికంగా ఉన్నా బోర్లు, బావుల కింద రైతులు పత్తి పంటలను సాగుచేశారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకపోతే కాస్త ఆలస్యమైనా రెండు రోజులుగా మోస్తరు వర్షాలు కురవటంతో భూమి పంటల సాగుకు కాస్త అనుకూలంగా మారింది. వాస్తవానికి రైతులు మృగశిరకార్తె ముగిసిన తర్వాత ఖరీఫ్ పంటల సాగును ప్రారంభిస్తారు. నైరుతి రుతుపవనాలు వచ్చినప్పటికీ జిల్లాలో విస్తరించటం కాస్త ఆలస్యమైంది.

నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, జూపాడుబంగ్లా, మిడ్తూరు, పగిడ్యాల, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 50,758 ఎకరాలు కాగా ఇప్పటికే సుమారు 22,530 ఎకరాల మేర బోర్లు, బావులు, వర్షాధారం కింద మొక్కజొన్న, పత్తి, మినుము, కంది పంటలు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జూపాడుబంగ్లా మండలం వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 10,022 హెక్టార్లు కాగా ఈ ఏడాది 8,964 హెక్టార్లలో పంటలు సాగుచేసే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి, పండుమిరప పంటలకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు అధికంగా వాటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గతేడాది పత్తి 1,950 హెక్టార్లు ఉండగా ఈ ఏడాది 2,412 హెక్టార్లలో సాగుచేసే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు అంచనాకు వచ్చారు. మండలంలో అత్యధికంగా మొక్కజొన్న 5,120 ఎకరాలు, వరి 596, మినుము 135, ఉల్లి 295, ఎండుమిరప 650ఎకరాల్లో పంటలు సాగుచేసే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా తట్టుకోవటంతో పాటు గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉంటుందనే ఉద్దేశంతో పత్తి పంటను ముందస్తుగా సాగుచేస్తున్నారు. వ్యవసాయ బోర్లు, బావులున్న రైతులు మొక్కజొన్న, మిరప, ఉల్లి పంటలను సాగుచేస్తున్నారు. వీటితో పాటు వర్షాధారిత పంటగా పారుమంచాల, తంగడంచ, తూడిచెర్ల, పి.లింగాపురం, తరిగోపుల గ్రామాల్లో కందిపంటను రైతులు సాగుచేస్తున్నారు. రైతులు విత్తనాల సాగును ప్రారంభించిన నేపథ్యంలో వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు రైతులకు లభించేలా రైతుభరోసా కేంద్రాలల్లోని వ్యవసాయ సిబ్బందిని అప్రమత్తం చేయటంతో పాటు ఎరువుల కొరతలేకుండా చేశారు.

ఏఏ పంటల సాగుకు అనుకూలమంటే..

వాస్తవానికి జూన్ మాసంలో మృగశిరకార్తె ముగిసినప్పటి నుంచి ముమ్మరంగా రైతులు పంటలసాగులో నిమగ్నమవుతారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో నేడో, రేపో వర్షాలు కురవకపోతాయా అంటూ కొంత మంది రైతులు ఒట్టి మట్టిలోనే పత్తి, మొక్కజొన్న విత్తనాలను విత్తుకుంటున్నారు. జూన్ మాసం ముగిసినా పంటలసాగుపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న, పత్తి, కందులు జులై నెలాఖరు వరకు సాగుచేసుకోవచ్చునని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మినుము పంట సాగుకు అనుకూలమైన వాతావరణం ముగిసిందంటున్నారు.



మినుము పంటను సాగుచేస్తున్న రైతులు

జూన్ మాసంలో తగ్గి వర్షపాతం

జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 88.7 మిల్లీ మీటర్ల మేర కురవాల్సి ఉండగా నెలలోని 30 రోజుల్లో కేవలం 6 రోజులు మాత్రమే 53.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారుల గణాంకాలు వెల్లడవుతున్నాయి.

బలమైన వర్షం కోసం..



గతేడాది ఇప్పటికే భారీ వర్షాలు కురవటంతో పంటలు సాగుచేసి ఉంటిమి. ఈ ఏడాది మే మాసంలో ఆశించిన వర్షాలు కురిసినప్పటికీ జూన్ మాసంలో ఆశించిన వర్షాలు కురవలేదు. నేను కంది 3 ఎకరాల్లో సాగుచేస్తున్నాను. సరైన వర్షం కురవనందున విత్తనాలు సాగుచేయలేదు. మిగిలిన 7 ఎకరాల్లో రబీ పంటలు సాగు చేయాలనుకుంటున్నాను.

– జనార్దన్‌రెడ్డి, రైతు, పారుమంచాల

విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్నా



నాకు సొంతంగా 6 ఎకరాల పొలం ఉంది. దానికితోడు ఎకరా రూ.10వేల చొప్పున మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. 6 ఎకరాల్లో మొక్కజొన్న, 4 ఎకరాల్లో పత్తి, 2 ఎకరాల్లో కంది పంట వేయాలనుకుంటున్నాను. విత్తనాలు సిద్ధంగా ఉంచుకున్నాను. బలమైన వర్షం కురిస్తే వెంటనే విత్తనం వేస్తా.

– మారెన్న, రైతు, పారుమంచాల

పత్తి, మొక్కజొన్న విత్తనాలు నాటాను



నాకు సొంతంగా కేసీ కాల్వ కింద 3.50ఎకరాల పొలం ఉంది. దీనికితోడు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. వారం క్రితం కురిసిన వర్షానికి మొక్కజొన్న, పత్తి విత్తనాలు విత్తుకున్నాను. ఇంకా మొలక రాలేదు. దేవుడు కరుణించి ఓ వర్షం కురిస్తే బాగుంటుంది. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవటంతో ఇప్పటికే పంటలు సాగుచేసి ఉంటిమి.

– ఖురేష్, రైతు, తాటిపాడు

క్లుప్తంగా

మల్లన్న సన్నిధిలో మంత్రి పూజలు



మంత్రి దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ధర్మకర్త మండలి సభ్యులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీమల్లికార్జున స్వామి వారికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు శుక్రవారం పూజలు నిర్వహించుకున్నారు. మంత్రి దంపతులకు దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం మంత్రి దంపతులను వేదపండితులు సత్కరించి, స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. మంత్రి వెంట ధర్మకర్తల మండలి సభ్యులు డా.సి.కనకదుర్గ, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కొత్తపల్లి: పెద్ద పులి రాకను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హుస్సేన్ బాషా బలపాలతిప్ప గ్రామస్తులకు సూచించారు. పులి సంచరించిన ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.పులి గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని, డ్రమ్స్, టపాసులు పేల్చుతూ అడవిలోకి పంపించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. పులి కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నైతిక విలువలు పెంపొందించాలి

మిడుతూరు: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని ఎంఈఓ మౌలాలి, ఎంఈఓ –2 శ్రీనాథ్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం వారు నాగలూటి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు పెంచడంతోపాటు క్రమశిక్షణ అలవర్చుకునేలా బోధన సాగాలన్నారు.విద్యార్థులు యూనిఫాం ,షూ, బెల్ట్ ధరించి పాఠశాలకు సమ యానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సుంకన్నకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పరిశీలించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శుక్రవారం శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు వరప్రసాద్ మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యురాలు చిన్మయి పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి 12 మందిని శస్త్రచికిత్స కోసం రెఫర్‌చేశారు. మరి కొందరికి ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు.వైద్యశిబిరంలో ఆర్గనైజర్లు మధు,మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా తిరుపంరెడ్డి

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా దేశం తిరుపంరెడ్డిని నియమించింది. తనను జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా నియమించిన సీఎం వైఎస్ జగన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి తిరుపంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పైప్‌లైన్ పనులకు అడ్డంకులు సృష్టించొద్దు



గ్రామస్తులతో కలిసి కేసీ కెనాల్ లిఫ్ట్ పైప్‌లు వెళ్లన ప్రభుత్వ పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసు

పగిడ్యాల: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు అవసరమయ్యే నీటిని తరలించేందుకు ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి రోడ్డు మార్గం ద్వారా వేస్తున్న పైప్‌లైన్ పనులకు అడ్డంకులు సృష్టించొద్దని ఆత్మకూరు రెవె న్యూ డివిజనల్ ఆఫీసర్ ఎం.దాసు కోరారు. శుక్రవారం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. పైప్‌లైన్ ముచ్చుమర్రి గ్రామం గుండా వస్తున్నందున గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మానం తీసుకోవాలని తహసీల్దార్ భారతీ, ఎంపీడీఓ వెంకటరమణకు ఆదేశించారు. ప్రజల నుంచి అభ్యంతరాలు ఎదురైతే ప్రత్యామ్నాయం కనుగొనాలని సర్వేయర్ శ్రీనువాసులును ఆదేశించారు.

డ్రమ్‌సీడర్ విధానంతో రైతులకు ఖర్చు మిగులు

మహానంది: డ్రమ్‌సీడర్ విధానం ద్వారా వరి సాగు చేస్తే పదిరోజుల ముందే కోతకు రావడంతో పాటు నాటే పద్ధతితో పోలిస్తే ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు తగ్గుతుందని ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం గ్రామంలో శుక్రవారం డ్రమ్‌సీడర్ ద్వారా వేస్తున్న వరి నాటును ఆయన పరిశీలించారు.

నేడు అబ్దుల్లాపురానికి ఎమ్మెల్యే శిల్పా రాక

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్ తెలిపారు. జగనన్న సురక్ష గ్రామ సభలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొననున్నారని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని వారు కోరారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

మహానంది: గాజులపల్లెలోని కొత్తకొట్టాల కాలనీకి చెందిన వెంకటలక్ష్మమ్మ కోతుల దాడిలో గాయపడింది. శుక్రవారం ఇంటి వద్ద ఉండగా కోతులు మీదకు రావడంతో తప్పించుకోబోయి గాయపడింది. స్థానికులు వాటిని తరిమేశారు.

సర్పాల సయ్యాట



పాములపాడు: స్థానిక వైఎస్ఆర్ నగర్‌లో శుక్రవారం రెండు సర్పాలు సయ్యాటలాడుతూ ప్రజల కంట పడ్డాయి. దాదాపు గంటకు పైగా ఈ సర్పాలు అక్కడే పొదల పక్కన ఒకదానికొకటి పెనవేసుకుంటూ ఉండిపోయాయి.

సంక్షేమ సారథి సీఎం జగన్



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: సంక్షేమ సారథి సీఎం జగన్ అని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మండలంలోని నాగలూటి గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ బుక్‌లెట్‌ను అందజేశారు. తెలంగాణ నుంచి పదేళ్ల క్రితం తన కూతురి వద్దకు వచ్చి ఇక్కడే బతుకీడుస్తున్నానని, తనకు రేషన్ కార్డు లేక పోవడంతో పింఛన్ రావడం లేదని, ఎలాగైనా తనకు పింఛన్ ఇప్పించాలని సుబ్బమ్మ అనే వృద్ధురాలి ఎమ్మెల్యేకు విన్నవించగా ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, పీఆర్ డీఈ దనిబాబు, ఎంఈఓ మౌలాలి, ఎంఈఓ–2 శ్రీనాథ్, వైఎస్సార్ సీపీ నాయకులు కమతం వీరారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అయ్యన్న, ఇనాయతుల్లా, పుల్లయ్య, సీతారాముడు, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.



ఏఈఓ పరశురామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న ఈఓ, అధికారులు



వాచ్‌మెన్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ఈఓ, అధికారులు

పదవీ విరమణ సత్కారం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి ఎస్.పరశురామశాస్త్రి, వాచ్‌మెన్ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచన మండపంలో వారిని ఈఓ ఎస్.లవన్నతో పాటు పలువురు అధికారులు సత్కరించారు.

సన్మానం



రిటైర్డ్ అయిన అసిస్టెంట్ బ్రాంచి పోస్టు మాస్టర్‌ను సన్మానించిన దృశ్యం

మిడుతూరు: చింతలపల్లి గ్రామంలోని అసిస్టెంట్ బ్రాంచి పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న సయ్యద్ బాషాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నందికొట్కూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పగిడ్యాల: సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం లైన్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

కొత్తపల్లి:సీపీఐ మండల అధ్యక్షుడు వెంకటశివుడు ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్‌చార్జీలు తగ్గించాలని ధర్నా చేశారు.

పాములపాడు: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.

రుచికర భోజనం అందించాలి

కొత్తపల్లి: విద్యార్థులకు మధ్యాహ్నం రుచికర భోజనం అందించాలని మండల విద్యాధికారులు శ్రీరాములు,ఇనాయతుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీ ఉత్సవం

మహానంది: గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది.ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు.

పంటల బీమా మంజూరు

పగిడ్యాల: మండలంలోని 364 మంది రైతులకు రూ.48.65 లక్షల పంట బీమా మంజూరైనట్లు వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2022–23 వార్షిక సంవత్సరానికి పంట ఉత్పత్తులను ఆధారం చేసుకుని రైతులకు పంట బీమా మంజూరు చేశారన్నారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో బీమా మంజూరైన రైతుల జాబితా ప్రచురించామన్నారు. జాబితాలో పేర్లు సరిచూసుకోవాలని సూచించారు.

జూపాడుబంగ్లా: మండలంలోని 1,190 మంది రైతులు సాగు చేసిన 967.35 ఎకరాలకు పంటల బీమా కింద రూ.1,97,88,217 మంజూరైందని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. పరిహారం త్వరలో రైతుల ఖాతాల్లో జమ కానుందన్నారు.

పాములపాడు: మండలంలో 6,083 మంది రైతులకు పంటల బీమా రూ.4,21,03,816 మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు. త్వరలోనే అన్నదాతల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అత్యధికంగా చెలిమిల్ల గ్రామంలో 865 మంది రైతులకు, అత్యల్పంగా జూటూరు–2 గ్రామానికి 57 మంది రైతులకు బీమా వర్తించిందన్నారు.

కొత్తపల్లి: నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంటల బీమా పరిహారం విడుదల చేసిందని ఏఓ కె.మహేష్ అన్నారు. 4,496 మంది రైతులకు రూ.12,446,741 ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 4వ తేదీలోపు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు.

మహానంది: మండలానికి రూ.23.70 లక్షల పంటల బీమా మంజూరైనట్లు వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. 524 మంది రైతులకు రూ.23,70,989 మంజూరైందన్నారు.

గడప గడపకు సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: గడప గడపకు సంక్షేమ పాలన కొనసాగుతోందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మజారా గ్రామం ఎరుకల కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాగు నీటి సమస్య ఉందని కాలనీవాసులు విన్నవించగా వెంటనే నీటిని పరిశీలించి ట్యాంకులు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివలింగం, బండి ఆత్మకూరు సర్పంచ్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

కడమల కాల్వలో ప్రబలిన అతిసారం



నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామంలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఆరుగురు, శుక్రవారం మరో ఆరుగురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ నంద్యాలలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన పదేళ్ల వయసున్న నాగగీతిక, వెంకటమ్మ, బాలుసుంకన్న, వెంకటరమణ, చిన్నవెంకటసుబ్బారెడ్డితో పాటు పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న నారాయణాపురం వైద్యాధికారులు డాక్టర్ కిరణ్‌కుమార్, దినేష్‌లు గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మెరుగైన వైద్యం అందించినట్లు వైద్యులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనరసింహం, ఇతర అధికారులను పంపించి నీటి పరీక్ష కోసం శాంపిళ్లను సేకరించి పరీక్షలకు పంపినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. కాగా అందరి పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు కిరణ్‌కుమార్ తెలిపారు.

జగనన్న పాలనలోనే ముస్లింల అభివృద్ధి



కరపత్రాలు విడుదల చేసిన ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ హాజీ షేక్ అబ్దుల్ షూకూర్

పగిడ్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింల అభివృద్ధి జరిగిందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ షేక్ అబ్దుల్ షూకూర్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమ కరపత్రాలను శుక్రవారం మండలంలోని పడమర ప్రాతకోట మసీదుల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మత పెద్దలకు జగన్ పాలన గురించి వివరించారు. దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో ఎంతో మందికి విద్య, ఉద్యోగ, రాజకీయంగా లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న పాలనలోనూ ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి పదవి దక్కిందన్నారు. రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలవాలని ముస్లింలను కోకారు. ఆయన వెంట మసీదు ఇమామ్ యూనుస్, మౌజన్ ఖాజా, సుభాన్, ఇస్మాయిల్, హుస్సేన్, హనీఫ్, మాబాషా, అక్బర్, షాషావలి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నందికొట్కూరు రూరల్: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం కోళ్లబావాపురం, మల్యాల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి జగనన్న ప్రత్యేక నిధులు విడుదల చేశారన్నారు. ప్రభుత్వ నిధులతో మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు క్రిష్ణవేణి, ఉమాదేవి, మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జున, ఎల్లనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతం చేయాలి

వెలుగోడు: శనివారం నుంచి ప్రారంభమవుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో షేక్ అమానుల్లా కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జులై 1న అబ్దుల్లాపురం, 4న బోయరేవుల, 6న గుంతకందాల, 11న మోతుకూరు, 13న రేగడగూడురు, 15న రేగడగూడురు–2, 18న వెలుగోడు –1,20న వెలుగోడు–2, 22న వెలుగోడు–3, 25న వెలుగోడు–4, 27న వెలుగోడు –5, 29న వేల్పనూరు–1, 2 సచివాలయాల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

మిడుతూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జగనన్న సురక్ష ప్రత్యేక అధి కారి రఘురామయ్య అన్నారు. శుక్రవారం మిడుతూరు–1 గ్రామ సచివాలయం తనిఖీ చేసి జగనన్న సురక్ష కార్యక్రమంపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

పగిడ్యాల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భూ గర్భ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురామ్ సూచించారు. శుక్రవారం సచివాలయం–2ను ఆయన సందర్శించారు. కుల, ఆదాయ, రేషన్, జనన, మరణ, వారసత్వ ధ్రువపత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతీ, ఎంపీడీఓ వెంకటరమణ ఉన్నారు.

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీకృష్ణ శుక్రవారం మాట్లాడుతూ జగనన్న సురక్షలో భాగంగా సచివాలయ సిబ్బంది,వలంటీర్లు ప్రతి గ్రామాల్లో పర్యటించి ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు అందజేయాలన్నారు.

నందికొట్కూరు: 1 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాలు విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి తప్పని సరిగా హాజరుకావాలన్నారు. ఒక టీంలో తాను, మరో టీంలో మున్సిపల్ మేనేజర్ మంజునాథ్‌గౌడు ఉంటామన్నారు.

ఆత్మకూరు: నేటి నుంచి 27వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారులు హాజరై ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'కు ఎమ్మెల్యే శిల్పా

మహానంది: బొల్లవరం, ఏ.కోడూరు గ్రామాల్లో శనివారం నుంచి ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతున్నట్లు పార్టీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు.